


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 195 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 21 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :195 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 21 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

## నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం



- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు."అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు.

మిగతా 2లో

# యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

## శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార



- రెండు యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా విజ్ఞప్తి చేసిందన్న శ్రీలంక అధ్యక్షుడు
- యుద్ధంలో తటస్థ వైఖరిని అనుసరిస్తున్నట్లు వెల్లడి
- శ్రీలంక పార్లమెంటుకు తెలిపిన అధ్యక్షుడు అనురకుమార

మిగతా 2లో



# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

## ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి మృతి

- ఇరాన్ ఉన్నతాధికారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు
- ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి అలీ మహ్మద్ నయినీ మృతి
- ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిక
- ఇటీవల ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి, జాతీయ భద్రతా మండలి కార్యదర్శి కూడా మృతి

మిగతా 2లో

# పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలి

## పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సూచన
- అకాల వర్షాలతో రాష్ట్రంలో రూ.62 కోట్ల మేర పంట నష్టం అంచనా
- మొక్కజొన్న, వరితో పాటు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం



**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ... గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో



# కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు

- తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, బ్రహ్మణి, దేవాన్ష్
- రాత్రికి తిరుమల చేరుకోనున్న నారా లోకేశ్
- రాత్రికి తిరుమలలో బస చేయనున్న సీఎం, ఆయన కుటుంబసభ్యులు
- దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి దర్శనం
- అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షలు విరాళం ఇవ్వనున్న కుటుంబం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఆయన వెంట అర్ధాంగి భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేశ్ రాత్రికి తిరుమలకు చేరుకోనున్నారు. శనివారం (మార్చి 21) నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులంతా కలిసి రేపు ఉదయం శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి సేవలో పాల్గొననున్నారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని నారా వారి కుటుంబం తరఫున ప్రతి ఏటా కొనసాగిస్తున్న ఆనవాయతీ ప్రకారం, ఈసారి కూడా శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందించనున్నారు.

మిగతా 2లో



# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు సుప్రీంకోర్టు కీలక తీర్పు

- అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్య ప్రేరేపణ కాదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య
- గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టిన సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 2లో

# అవినాశ్ రెడ్డి నటన ఆస్కార్ రేంజ్‌లో ఉంది



- చంద్రబాబుకు సునీత సహకరిస్తోందన్న అవినాశ్ వ్యాఖ్యలపై బీటెక్ రవి మండిపాటు
- సునీతకు రాజకీయ కోరిక ఉంటే అవినాశ్ స్థానంలో ఆమె ఎంపీ అయ్యేవారని వ్యాఖ్య
- వివేకా హత్య కేసులో అవినాశ్ శిక్ష నుంచి తప్పించుకోలేరన్న బీటెక్ రవి

మిగతా 2లో

# ఇది నిరుద్యోగులను వంచించడమే.. చంద్రబాబుది పచ్చి మోసం



- ఉగాదికి 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం
- ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనంటూ తీవ్రంగా విమర్శించిన షర్మిల
- రాష్ట్రంలో 1.80 లక్షల ఖాళీలుంటే పదివేల పోస్టులేంటని ప్రశ్న
- వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీత
- ఉద్యోగాలకు వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్

మిగతా 2లో

# ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత... లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు



- పారిశ్రామిక డీజిల్ ధరకు రెక్కలు
- లీటరు ధర రూ.87 నుంచి రూ.109కి చేరిన ఇండస్ట్రియల్ డీజిల్
- ప్రీమియం పెట్రోల్ ధరలు కూడా లీటరుకు రూ.2 పెరిగిన వైనం
- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతోనే అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు
- ఉత్పత్తి ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆందోళన

మిగతా 2లో

# నాడు పాదయాత్రలో లోకేశ్ మాట... నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట



- 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- 20 నెలల్లోనే 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించిన మంత్రి పార్థసారథి
- వైసీపీ హయాంలో యువత, హిందూ మనోభావాలు దెబ్బతిన్నాయని తీవ్ర విమర్శలు
- రాష్ట్రంలోని 12.5 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం
- జగన్‌కు హిందూ ధర్మంపై గౌరవం లేదన్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

మిగతా 2లో

# జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడు



## వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన

- వైఎస్ కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన విజయమ్మ
- ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల
- షర్మిలకు రాసిన ఆస్తులు న్యాయంగా ఆమెకు చెందినవేనని వెల్లడి
- ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం చేశారని లేఖలో ఆవేదన
- వైఎస్సార్ ఆదేశానుసారం ఆస్తులు నలుగురు మనుమలకు పంచాలని వివరణ

మిగతా 2లో




## హార్ముజ్.. ఇరాన్ కొత్త రూల్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటి హోర్ముజ్ జలసంధి. ఇది ఇప్పుడు సరికొత్త దౌత్య యుద్ధానికి వేదికైంది. యుద్ధం అంటే కేవలం క్షిపణుల ప్రయోగమే కాదు, వ్యూహాత్మక ఎత్తుగడల చదరంగం అని ఇరాన్ మరోసారి నిరూపిస్తున్నది.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ప్రతిపాదిం చిన 'కొత్త ప్రాంతీయ ప్రొటోకాల్' సహజ సిద్ధమైన జలమార్గాన్ని తన సొంత ఆస్తిగా మార్చుకోవడంతో పాటు అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బకొట్టాలన్న ఇరాన్ దీర్ఘకాలిక ఎత్తుగడగా పరిగణించాలి. మరోవైపు, ఈ సంక్షోభం అట్లాంటిక్ మహాసముద్రం ఇరువైపులా ఉన్న మిత్ర దేశాల మధ్య ఐక్యతను కుప్పకూల్చుతున్నది. మొత్తానికి హోర్ముజ్ చుట్టూ ముదురుతున్న ఈ మంటలు కేవలం చమురు ధరలనే కాదు.. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న అంతర్జాతీయ దౌత్య సమీకర ణాలను కూడా మార్చేలా కనిపిస్తున్నాయి. ఇరాన్ ఓటమి అంచున ఉన్నది. ఏ క్షణమైనా ముందు బేషరతుగా లొంగిపోవచ్చని అమెరికా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని.. ఇరాన్ తాజా ప్రతిపాదనలు నిరూ పిస్తున్నాయి. తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. యుద్ధం ముగిసిన తర్వాత హోర్ముజ్ జలసంధిలో 'కొత్త ప్రాంతీయ ప్రొటోకాల్' ఉండాలని పశ్చిమ దేశాల నౌకలు ఈ మార్గంలో వెళ్లాలంటే ఇరాన్ విధించే కొత్త షరతులకు తలవొంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓవైపు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ 'హోర్ముజ్ జలసంధిని తెరవడానికి మిత్రదేశాలన్నీ సైన్యాన్ని పంపాలి' అని పిలుపునిచ్చారు. కానీ యూరప్ స్పందన భిన్నంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు అమెరికా యుద్ధ ప్రయత్నాల్లో నేరుగా చేరడానికి నిరాకరిస్తున్నాయి. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల తాము ఇరాన్ ప్రతీకార దాడులకు లక్ష్యంగా మారకూడదని అవి భావిస్తున్నాయి. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన ఉత్పత్తిదారు కాబట్టి ఈ చమురు ధరల పెరుగుదల దానికి పెద్ద దెబ్బ కాదు. కానీ యూరప్ ఇంధనం కోసం గల్ఫ్ దేశాలపై ఆధార పడుతుంది. అమెరికా ఆంక్షలతో రష్యా ఇంధనాన్ని కూడా వదులుకోవడంతో గ్యాస్ ధరలు 20% పెరగడం యూరప్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నది. హోర్ముజ్ ద్వారా వచ్చే 60% చమురు సరఫరా నిలిచిపోవడంతో భారత్ ఇప్పటికే రష్యా నుండి వచ్చే చమురుపై ఆధారపడటం పెంచింది. ఇరాన్ నుండి రెండు ఇండియన్ ఎల్పీజీ ట్యాంకర్లకు మినహాయింపు లభించడం మనకు భారీగా ఊరట లభించింది.

అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నౌకలు మినహా మిగిలిన వాణిజ్య నౌకలు 'ఇన్నోసెంట్ పాసేజ్' కింద ఎవరి అనుమతి లేకుండానే హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లవచ్చు. కానీ, ఇరాన్ మాత్రం స్పష్టంగా ఒక మాట చెప్తున్నది. యుద్ధానికి ముందున్న విధానాలు పూర్తిగా మారాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఇరాన్ విధించే కొత్త షరతులు ఇలా ఉండే అవకాశం ఉన్నది. హోర్ముజ్ గుండా వెళ్లే ప్రతి నౌక 72 గంటల ముందే ఇరాన్ కోస్ట్ గార్డ్‌కు సమాచారం ఇచ్చి, అనుమతి తీసుకోవాలి. దీనివల్ల ఏ నౌకలో ఏముందో నిఘా పెట్టే అధికారం ఇరాన్‌కు వస్తుంది. హోర్ముజ్ జలసంధిలో భద్రతను ఇరాన్, ఒమన్ మాత్రమే చూస్తాయి.. కాబట్టి వెళ్లే ప్రతి నౌక కొంత మొత్తాన్ని 'సెక్యూరిటీ సర్‌చార్జ్'గా చెల్లించాలని కొత్త ప్రతిపాదన తెచ్చే అవకాశం ఉన్నది. గల్ఫ్ ప్రాంతానికి సంబంధం లేని దేశాల యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకలు ఈ జలసంధిలోకి ప్రవేశించకూడదు.. ఒకవేళ రావాల్సి వస్తే ఇరాన్ నేతృత్వంలోని 'రీజినల్ కౌన్సిల్' అనుమతి తీసుకోవాల్సి ఉంటుం దనేది అన్ని షరతుల్లో కీలకమైనది.. ఇరాన్ చమురును కొనే దేశాల నౌకలకు మాత్రమే ఈ జలసంధిలో 'గ్రీన్ చానల్' కల్పిస్తామని, ఆంక్షలు పాటించే దేశాల నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది. నిజానికి సూయజ్ కాలువ మానవ నిర్మితం. ఇది పూర్తిగా ఈజిప్ట్ భూభాగం గుండా వెళ్తుంది. కాబట్టి, దానిపై ఈజిప్టుకు పూర్తి సార్వభౌమాధికారం ఉంటుంది. ఎవరిని అనుమతించాలి? ఎంత రుసుము వసూలు చేయాలి? అనేది ఈజిప్ట్ ఇష్టం. హోర్ముజ్ జలసంధి పూర్తిగా సహజసిద్ధమైన జలమార్గం. పైగా ఇది అంతర్జాతీయ జలసంధి. దీని ఒక వైపు ఇరాన్, మరోవైపు ఒమన్ దేశాలు ఉన్నాయి. దీనిపై ఏ ఒక్క దేశానికీ పూర్తి హక్కు ఉండదు. సముద్ర చట్టాలపై అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ జలసంధుల గుండా వెళ్లే నౌకలకు 'నిరంతర, వేగవంతమైన ప్రయాణం' చేసే హక్కు ఉంటుంది. దీనిని ఏ దేశం అడ్డుకోకూడదు, రుసుము వసూలు చేయకూడదు. ఇరాన్ ఈ ఒప్పందంపై సంతకం చేసినా, దానిని పూర్తిగా ఆమోదించలేదు. అందువల్ల, తమ ప్రాంతీయ జలాల గుండా వెళ్లే నౌకలపై నియంత్రణ మాకు ఉండాలని ఇరాన్ వాదిస్తోంది. 'ఇరాన్ పెడుతున్న షరతులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. మేము వీటిని అంగీకరించం. అవసరమైతే బల ప్రయోగం చేస్తాం' అని అమెరికా అంటోంది. అమెరికా మొండిగా వెళ్తే ఇరాన్ పూర్తిగా జలసంధిని మూసేస్తుంది. ఫలితంగా చమురు, గ్యాస్ సరఫరా ఆగిపోతే యూరప్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. అందుకే ఇరాన్‌తో చర్చలు జరిపి ఏదో ఒక మధ్యేమార్గం చూడాలని ఆ దేశాలు అమె రికాపై ఒత్తిడి తెస్తున్నాయి. మొత్తానికి పరిస్థితి చూస్తే యూరప్ దేశాలు అమెరికాను ఒప్పించి.. ఇరాన్‌పై ఉన్న కొన్ని ఆర్థిక ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. దీనికి ప్రతిగా ఇరాన్ ప్రతిపాదిస్తున్న 'కొత్త ప్రొటోకాల్' డిమాండ్లలో కొన్ని వెనక్కి తీసుకునేలా ఒప్పందం కూడా కుదిరే అవకాశం ఉన్నది. హోర్ముజ్ జలసంధి గొంతుపై ఇరాన్ పెట్టిన కత్తితో యూరప్ సహా ప్రపంచ దేశాలు వణుకుతున్నాయనడంలో సందేహమే లేదు.

## నాడు పాదయాత్రలో లోకేశ్ మాట...
## నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట

నాడు పాదయాత్రలో యువతకు ఇచ్చిన మాట ప్రకారం, నేడు జాబ్ క్యాలెండర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బాటలు వేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగంతో అల్లాడిన యువతకు తమ కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు 2.3 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, వారిని నిలువునా వంచించారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, గ్రాడ్యుయేట్లలో 24 శాతం మందికి ఉద్యోగాలు లేవని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని గుర్తు చేశారు. ఉపాధి లేక రాష్ట్రంలో 4,100 మంది యువకులు ఆత్మహత్య చేసుకోవడానికి వైసీపీ ప్రభుత్వ అసమర్థతే కారణమని ఎన్సీఆర్బీ నివేదికను ఉటంకిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 6,28,347 ఉద్యోగాలు కల్పించిందని పార్థసారథి గర్వంగా ప్రకటించారు. ఇప్పటికే 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, తాజాగా మరో 10,060 ఉద్యోగాలతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా 2.5 లక్షల మందికి, జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా 1,46,620 మందికి, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు చూపించామన్నారు. నాడు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.

**అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం**

ఉద్యోగ కల్పనతో పాటు సంక్షేమానికి కూడా తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయం తీసుకున్నామని, ఫిబ్రవరి 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12.5 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని ప్రకటించారు. సిటీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో పూర్తి ఉచితంగా, ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేవలం 24 గంటల్లోనే రూ.45 కోట్లను ముస్లిం సోదరుల ఖాతాల్లో జమ చేశామని, పోలవరం నిర్వాసితులకు మూడు విడతల్లో రూ.1,943 కోట్ల పరిహారం అందించామని చెప్పారు. "మీసాలు తిప్పి, తొడలు కొట్టినంత మాత్రాన పనులు కావు, చిత్తశుద్ధి ఉండాలి" అని వైసీపీ నేతలకు చురకలు అంటించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ గత ఏడాది 16,000 మంది టీచర్లను నియమించామని, తాజా క్యాలెండర్‌లో 1,500 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నామని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలి

- మొదటి పేజీ తరువాయి

అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు.

ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు నివేదించారు.

## అవినాశ్ రెడ్డి నటన ఆస్కార్ రేంజ్‌లో ఉంది

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ సెగలు పుట్టిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌పై పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి నిప్పులు చెరిగారు. కడపలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, అవినాశ్ రెడ్డి నటన చూస్తుంటే ఆస్కార్ అవార్డు ఇచ్చే రేంజ్‌లో ఉందని ఎద్దేవా చేశారు. వివేకా కుమార్తె సునీత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సహకరిస్తున్నారన్న అవినాశ్ వ్యాఖ్యలపై బీటెక్ రవి తీవ్రంగా స్పందించారు. "సునీతకు గనుక రాజకీయ కోరిక ఉంటే... ఈరోజు అవినాశ్ రెడ్డి కడప ఎంపీ అయ్యేవారు కాదు. ఆ స్థానంలో సునీతమ్మే ఎంపీగా ఉండేవారు. కేవలం తన తండ్రిని చంపిన వారికి శిక్ష పడాలనే ఉద్దేశంతోనే ఆమె ఒంటరి పోరాటం చేస్తున్నారు తప్ప, ఇందులో రాజకీయాలు లేవు" అని స్పష్టం చేశారు.

వివేకా హత్య జరిగిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను బీటెక్ రవి ఈ సందర్భంగా సూటిగా ప్రస్తావించారు. "స్పాట్ పెట్టింది మీరు. స్పాట్‌కు వెళ్లింది మీరు. అక్కడ దగ్గరుండి సాక్ష్యాధారాలను క్లీన్ చేయించింది కూడా మీరే" అంటూ అవినాశ్ రెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. వివేకా కేసులో ఎన్ని డ్రామాలు ఆడినా, సాక్ష్యాలను తారుమారు చేసినా... చట్టం ముందు అవినాశ్ రెడ్డి దోషిగా నిలబడక తప్పదని, శిక్ష నుంచి ఆయన తప్పించుకోలేరని అన్నారు.

## అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

**కేసు నేపథ్యం ఏమిటంటే..**

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

**సుప్రీంకోర్టు ఏమంది?**

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృథా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.

అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

## యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా చేసిన విజ్ఞప్తిని తిరస్కరించాం

మార్చి నెల ప్రారంభంలో శ్రీలంకలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాలను దిగడానికి అనుమతించాలని అమెరికా కోరగా, అందుకు నిరాకరించామని శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే ఆ దేశ పార్లమెంటుకు తెలిపారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో శ్రీలంక తటస్థ వైఖరి అనుసరిస్తోంది. ఈ క్రమంలో యుద్ధ విమానాలను దింపడానికి అనుమతించాలని అమెరికా విజ్ఞప్తి చేయగా శ్రీలంక తిరస్కరించింది. ఇదే విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు పార్లమెంటుకు తెలిపారు. మార్చి 4 నుంచి 8 తేదీల మధ్య జిబూటీలోని ఒక స్థావరం నుంచి రెండు క్షిపణి సామర్థ్యం కలిగిన విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించేందుకు అమెరికా అనుమతి కోరిందని అనురకుమార తెలిపారు. కానీ అమెరికా అభ్యర్థనను తిరస్కరించామని వెల్లడించారు.ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ తటస్థ వైఖరితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నామని అన్నారు. పశ్చిమాసియా యుద్ధం ఎన్నోసవాళ్లను విసురుతోందని, అయినప్పటికీ ఏ పక్షానికి మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. జిబూటీలోని ఒక స్థావరం నుంచి 8 యాంటీషిప్ మిసైల్స్‌తో కూడిన రెండు యుద్ధ విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకురావాలని అమెరికా భావించిందని అన్నారు.

## ఇది నిరుద్యోగులను వంచించడమే..
## చంద్రబాబుది పచ్చి మోసం

ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతను నమ్మించి నయవంచన చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య "ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉగాది రోజున సీఎం చంద్రబాబు 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మే 15 నుంచి అక్టోబరు వరకు ఈ నియామకాలు పూర్తి చేస్తామని, ఇకపై ప్రతి ఏటా ఉగాదికి క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.అయితే, ప్రభుత్వ ప్రకటనపై షర్మిల ఘాటుగా స్పందించారు. "కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లు" కూటమి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండేళ్లుగా నిరుద్యోగులను ఊరించి చివరకు ఉసూరుమనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల్లోని ఖాళీలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. "విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, ఇంజనీరింగ్ విభాగంలో 20 వేలు, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, మున్సిపల్ శాఖలో 27 వేలు, రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు.రాష్ట్రంలోని 153 విభాగాల్లో కలిపి 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి క్యాలెండర్లు కాకుండా భారీ స్థాయిలో

ఖాళీలను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అలాగే, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ఒకరోజు అన్నవితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను టీటీడీకి విరాళంగా సమర్పించనున్నారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రాత్రికి చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులు తిరుమలలోనే బస చేసి, రేపు ఉదయం దర్శనానంతరం తిరిగి బయలుదేరనున్నారు.

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) మరోసారి ఇరాన్‌పై విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అధికార ప్రతినిధి, పబ్లిక్ రిలేషన్స్ హెడ్ అలీ మహ్మద్ నయీనీని హతమార్చినట్లు శుక్రవారం ప్రకటించింది. గత రెండేళ్లుగా ఐఆర్‌జీసీకి ప్రధాన ప్రచారకర్తగా నయీనీ పనిచేస్తున్నారని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయెల్‌పై ఉగ్రదాడులను ప్రోత్సహించేలా మధ్యప్రాచ్యంలోని ఉగ్రసంస్థలకు ఇరాన్ పాలన యంత్రాంగం యొక్క ఉగ్రవాద ప్రచారాన్ని వ్యాప్తి చేశారని ఆరోపించింది. మరోవైపు, పవిత్ర రంజాన్ మాసం చివరి గంటల్లో అమెరికా-ఇజ్రాయెల్ ఉగ్రదాడిలో తమ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అలీ మహ్మద్ నయీనీ 'అమరుడయ్యారని' ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఇది పిరికిపంద చర్య అని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్... ఇరాన్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులనే లక్ష్యంగా చేసుకుంటోంది. బుధవారం టెహ్రాన్‌లో జరిగిన వైమానిక దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్‌ను హతమార్చినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అంతకుముందు, ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని కూడా హతమార్చినట్లు ప్రకటించింది. మార్చి 17న టెహ్రాన్‌లో జరిగిన దాడిలో లారిజానీ తన కుమారుడితో కలిసి మరణించినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. అంతేకాకుండా, బసిజ్ పారామిలిటరీ దళాల యూనిట్ కమాండర్ ఘోలామ్‌రెజా సోలేమానీని కూడా హతమార్చినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్‌లో పౌర ప్రదర్శనకారులపై హింసకు, అణచివేతకు సోలేమానీ నాయకత్వం వహించారని ఐడీఎఫ్ ఆరోపించింది. ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్ కీలక అధికారులను కోల్పోతుండటం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

## అదో కాగితపు పులి.. పిరికివాళ్లు

- మొదటి పేజీ తరువాయి

కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత...
## లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

## జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్వయంగా స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. "2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే (ఫశీఎఎఱఅవస టుఎఅశ్రీఎ ఖంంవం). ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.

ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ గారు జగన్ కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా. దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.

## జెసి యశ్వంత్ కుమార్ కు స్వాగతం పలికిన మున్సిపల్ అధికారులు

**సాలూరు పెన్ పవర్ మార్చ్ 20:** సాలూరు మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బంది జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ సాలూరు మున్సిపల్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన సమయంలో మున్సిపల్ సిబ్బంది పూలగుచ్చాలతో స్వాగతం పలికారు అనంతరం ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరించి మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ ఉద్యోగుల అంతమంది అంకితభావంతో పనిచేసే మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు పారిశుధ్య పనులు నిర్వహణ చేయాలని ప్రత్యేక అధికారి యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.



# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# జిల్లాలో రైల్వేలు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తాం







- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- హరిశ్చంద్రపురం, మందస, పాతపట్నం స్టేషన్ లలో నూతన హాల్ట్ లను ప్రారంభించిన కేంద్ర మంత్రి.
- రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, వైద్య అవసరాలకు తాజా హాల్టులు ఉపయుక్తం
- జిల్లాలో ప్రతీ స్టేషన్ ను అభివృద్ధి చేసుకుని వచ్చాం.. భవిష్యత్ లో మరిన్ని విప్లవాలు సృష్టిస్తాం : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం మార్చి 20 :** శ్రీకాకుళం జిల్లాలో రైల్వే వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నాడు జిల్లాలోని కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో విశాఖ – గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్ ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో కలసి ప్రారంభించారు. అదేవిధంగా మందస రోడ్ రైల్వే స్టేషన్ లో బెర్హంపూర్ విశాఖపట్నం ఎక్స్ప్రెస్ ను కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. పాతపట్నంలో రోర్కెల గుణపూర్ రాజ్యరాణి ఎక్స్ప్రెస్ ల నూతన హాల్టు ను స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావులతో కలసి ప్రారంభించారు. అంతకు ముందు మూడు చోట్ల ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి హామీ ఇచ్చి.. కొద్ది రోజుల్లోనే హాల్ట్ మంజూరు అయ్యేలా కృషి చేసిన రామ్మోహన్ నాయుడుకు ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చెయ్యాలని కోరారు. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ కు చేరుకునే అప్రోచ్ రోడ్లను విస్తృతం చెయ్యాలని కోరారు. అదే విధంగా నందిగాం – రౌతుపురం లో రోడ్డు అభివృద్ధి, టెక్కలిలో ఉన్న రైలు గేటును డబుల్ గేట్ గా విస్తృత పరచాలని అచ్చెన్నాయుడు కోరారు. దీనిపై రైల్వే అధికారులు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడులు దృష్టి సారించాలన్నారు.

అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సభ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. హరిశంద్రపురం రైల్వే స్టేషన్ లో ట్రైన్ హాల్ట్ కోసం విశేష ప్రయత్నం చేశామని.. ఉగాది పర్వదినం సమీపంలో అది సాకారం అవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సర్వీస్ ద్వారా స్థానిక రైతులకు, మహిళలకు, విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా మారనుందని అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, గుణపూర్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ అభివృద్ధికి హద్దులు చెరిపేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు అన్నారు. హరిశ్చంద్ర పురం స్టేషన్ లో ఇరవై ఏళ్ళ క్రితం ఎలా ఉంది, ఈరోజు ఎలా ఉంది అనే తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హరిశ్చంద్ర పురంలో అభివృద్ధి చేస్తే స్థానికంగా విశేష ఉపాధి వనరులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్లాట్ ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, స్టాపేజి.. ఇలా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. స్టేషన్ ను ఆనుకుని రైల్వే పరిధిలోని 40 ఎకరాలను సైతం అభివృద్ధి చేస్తామని, తద్వారా ఉపాధి అందుతుందని తెలిపారు. వేర్ హౌస్, గూడ్స్ షెడ్, కంటైనర్ టెర్మినల్ లాంటి వాటిని ఇక్కడ ఏర్పాటు చేస్తామని అన్నారు. స్థానిక ప్రజలు కూడా నూతన హాల్ట్ సర్వీసులను ఎక్కువగా ఉపయోగించుకోవాలని కోరారు.

రైల్వే జోన్ ను విశాఖ లో త్వరలో ప్రారంభిస్తామని.. ఇకపై మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు కార్యరూపం దాల్చుతాయని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి అచ్చెన్నాయుడు కోరిన అభివృద్ధి పనులు కూడా అతి త్వరలో చేరువ చేస్తామని హామీ ఇచ్చారు. చాలామంది లీడర్లు కేంద్ర ప్రభుత్వ స్థలం లో అభివృద్ధికి కేంద్రం నిధులపై ఆశపడతారని.. కానీ అచ్చెన్నాయుడు గారు అందుకు భిన్నంగా అనుమతులు మీరివ్వండి.. అభివృద్ధి మేము చేసుకుంటామని అనడం.. ఆయనకు మాత్రమే చెందిందని కితాబిచ్చారు.

పోర్టు ఏర్పాటు ద్వారా అటు రాయ్ పూర్ నుండి ఇటు ఒడిశా వరకు అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సాల్ట్ భూముల సమస్యను పరిష్కరించామని అన్నారు.. అభివృద్ధి చేస్తూ ఉన్నామని.. కంపెనీలు రావడమే ఆలస్యం అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇరవై లక్షల ఉద్యోగాల హామీ తో కూటమి సర్కారు ఉపాధి దిశగా బలమైన అడుగులు వేస్తోందని అన్న రామ్మోహన్ నాయుడు.. అందుకు ఉత్తరాంధ్ర లో కూడా సమాన ప్రాధాన్యత దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ భావాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నామని తెలిపారు. ప్రపంచం ఇప్పుడు భారత దేశం వైపు చూస్తుంటే.. భారత్ వచ్చిన సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. గూగుల్ లాంటి సంస్థ లక్ష ముప్పై వేల కోట్లు అడుగు దూరంలోని విశాఖ లో పెట్టుబడి పెట్టడం, మిట్టల్ స్టీల్ ప్లాంట్ 80 వేల కోట్లతో 23న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. వీటితో పాటు మూల పేట పోర్ట్, రేర్ ఎర్త్ మినరల్స్ ద్వారా అనేక ఇండస్ట్రీలు రానున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల ఆశీస్సులు శ్రీకాకుళం జిల్లాపై మెండుగా ఉన్నాయని.. కూటమిలో సిక్కోలు మరింతగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

వరుసగా కేటాయింపులు, అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. నలభై ఐదు రోజుల వ్యవధిలోనే 6 స్టాపులు శ్రీకాకుళం లో మంజూరు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్ లో సమీప స్టేషన్ లో ప్రశాంతి ఎక్స్ప్రెస్, ఇతర రైళ్ళను కూడా స్టాపేజి కల్పిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుండి నేరుగా సికింద్రాబాద్, తిరుపతి లకు రైళ్ల ఏర్పాటు కోసం విశేష కృషి చేస్తున్నట్టు తెలిపిన రామ్మోహన్ నాయుడు.. అందుకు రైల్వే శాఖ నుండి, మంత్రి అశ్వినీ వైష్ణవ్ నుండి సానుకూల స్పందన వచ్చినట్టు తెలిపారు. సర్వేలు కూడా ఈ విషయంపై సాగుతున్నట్టు అన్నారు.

జిల్లాలో రైల్వే ల అభివృద్ధికి తన తండ్రి దివంగత కింజరాపు ఎర్రంనాయుడు గారు విశేష కృషి చేశారని.. ఆయన ఆశయ సాధనకు తాను ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు.

మందస రోడ్ రైల్వే స్టేషన్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి విస్తరణకు ప్రణాళిక సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. మందస స్టేషన్ లో భవిష్యత్లో మరిన్ని హాల్ట్ లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పాతపట్నం లో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ భవిష్యత్ లో పాతపట్నం నుండి వారంతపు ఎక్స్ప్రెస్ రైళ్ల నిలుపుదల కు కృషి చెయ్యాలని కోరారు.

అనంతరం పాతపట్నం లో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కీలక హామీలు ఇచ్చారు. దేశంలో ఎక్కడ లేని విధంగా.. ఒక జిల్లాలో 45 రోజుల వ్యవధిలోనే ఆరు నూతన హాల్టు ల మంజూరు జరగడం ఆనందంగా ఉందని అన్నారు. మూలపేట పోర్ట్ ఏర్పాటు నేపథ్యంలో ఆ పోర్టుకు ఒరిస్సాను అనుసంధానం చెయ్యడం లో పాతపట్నం స్టేషన్ కీలకంగా మారుతుందని అన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో సాగునీరు, త్రాగునీరు ప్రాజెక్టులకు, జల్ జీవన్ మిషన్ కు, కరకట్టల నిర్మాణం కు అధిక కేటాయింపులు జరుగుతున్నాయి అన్నారు.

12 ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లా పరిధిలో రైళ్ల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని.. షెల్టర్లు, స్టాపేజీలు, మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూ విశేష వృద్ధి సాధించామని తెలిపారు. రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ గా ఎర్రన్నాయుడు గారు విశేష కృషి చేశారని.. నారో గేజ్ ను బ్రాడ్ గేజ్ గా మార్చారని అన్నారు. ఈ నౌపడ గుణపూర్ లైన్ ను 1200 కోట్లతో మరింతగా పొడిగిస్తున్నామని హామీ ఇచ్చారు. అదేవిధంగా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాతపట్నం, టెక్కలి స్టేషన్ లను క్రాసింగ్ స్టేషన్ల గా మార్చుతామని హామీ ఇచ్చారు. ఈ నౌపడ, టెక్కలి పాతపట్నం లైన్ ను డబుల్ లైన్ గా మార్చడానికి కూడా కృషి చేస్తున్నామని ఆర్.డి.ఓ ద్వారా సర్వే ప్రయత్నాలు కూడా చేస్తున్నామని తెలిపారు. 9కోట్ల రూపాయలతో నితిన్ గడ్కరీ దగ్గర కూర్చొని నీలమణి దుర్గ ఆలయం వద్ద ఫ్లై ఓవర్ మార్పులు చేశామని తెలిపారు.

ప్రధాని మోదీ ధీటైన నాయకత్వంతో దేశం అభివృద్ధి వైపు వేగంగా పయనిస్తూ ఉంటే.. సర్వనాశనం అయిన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు నడిపిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదని అన్నారు. ఇప్పుడు రాష్ట్రం వైపు పెట్టుబడులు వెతుక్కుని వస్తున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాల్తేర్ రైల్వే డి.ఆర్.ఎమ్ లలిత్, ఖుర్దా డి.ఆర్.ఏం సునీల్, యార్లగడ్డ వెంకన్న చౌదరి, రైల్వే అధికారులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

## వంద పడకల ఏరియా ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి





**గిరిజన మహిళలకు ప్రసూతి కేంద్రం ఏర్పాటు చేయండి**

**సాలూరు పెన్ పవర్ మార్చ్ 20:** సాలూరు నూతనముగా నిర్మాణము చేసిన వంద పడకల ఏరియా ఆసుపత్రులని గిరిజన శాఖ మంత్రి జి సంధ్యారాణి, శుక్రవారం ఉదయం లంచనముగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధికారములో ఉన్న సమయంలో శంకుస్థాపన చేసి పునాదులకే పరిమితము అయ్యారని అన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు సాలూరు వంద పడకల ఆస్పత్రులుగా చేయాలని చెప్పడం జరిగిందని అన్నారు అప్పటిలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిధులు మంజూరు చేయలేదని అన్నారు. శాసనసభ ఎన్నికలలో 2024 లో సాలూరు ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందని అన్నారు. సాలూరు నియోజకవర్గం పరిధిలో గిరిజన గ్రామాలు కొండలపై ఉన్న పంచాయతీ గిరిజనలు వైద్యం కోసం సాలూరు సిహెచ్ కి వస్తే అప్పటిలో కేవలం 30 పడకలో ఆసుపత్రిగా ఉండేదని సిబ్బంది కొరత చాలీచాలని భవనాలు లేక వైద్యము అరకొరగా అందలేదని అన్నారు. గిరిజన గిరిజనేతర ప్రజలు వైద్యం కోసము చాలా ఇబ్బందులు. పడేవారిని అన్నారు. గిరిజన గ్రామాల్లో పర్యటించి గిరిజన ఆరోగ్య సమస్యలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని ప్రతిపాదించగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ నాలుగు కోట్ల రూపాయలు నిధులు వెంటనే మంజూరు చేశారని అన్నారు. శంకుస్థాపన చేసి యుద్ధ ప్రాతిపదికపై శరవేగంగా పనులు నిర్వహించి మరో 14 కోట్ల రూపాయలు మంజూరు చేయించి మొత్తం 17 కోట్ల రూపాయలతో వంద పడకల ఏరియా ఆసుపత్రిని పూర్తి చేయడం జరిగిందని అన్నారు. సాలూరు నియోజక వర్గ ప్రజలు కష్టాలు తీరుతావని అన్నారు సాలూరు వై టి సి సెంటర్లో గర్భిణీ గిరిజన మహిళలు కోసము ప్రసూతి కేంద్రం ఉందని దానిని ఏరియా ఆసుపత్రికి తరలిస్తూ వైద్య సేవలు చేయాలని అధికారులను కోరారు ఏరియా ఆసుపత్రులలో 96 మంది మెడికల్ సిబ్బంది డాక్టర్స్ స్టాఫ్ నర్స్ ఏఎన్ఎంలు వైద్య సేవలు అందిస్తారని అన్నారు. వచ్చిన రోగులను జిల్లా కేంద్రానికి రిఫర్ చేయకుండా ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సాలూరు ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గం పరిధిలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్నాయని గిరిజనులు నిరక్షరాస్యత ఆచార సంప్రదాయాలు ప్రకారము వైద్యము సంచి వైద్యులు దగ్గర వైద్య సేవలు చేయించుకుంటారని అన్నారు. వైద్యం వికసించిన తరువాత వారు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తారని అన్నారు. స్థానిక ఏఎన్ఎంలు వారి వద్దకు విధులకు వెళ్లే సమయంలో వారికి ఆరోగ్యం బాగోలేనప్పుడు వారిని చైతన్యపరిచి వంద పడకల ఆసుపత్రిలో చేర్పించి వారికి వైద్య సేవలు అందించాలని కోరారు. డాక్టర్లు వారిని ఆచార సాంప్రదాయాలు వివరాలడిగి మంచి వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సమావేశానికి సాలూరు పాచిపెంట మక్కువ సాలూరు టౌను తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఎంపీడీవో జి పార్వతి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ మీనాక్షి తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అల్లూరి జిల్లాను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి:

### కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు,పెన్ పవర్, మార్చి 20:** అల్లూరి సీతారామరాజు జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పాడేరు క్యాంప్ కార్యాలయంలో అటవీ, పర్యాటక శాఖల అధికారులతో అరకు, పాడేరు, లంబసింగి క్లస్టర్ల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.మూడు క్లస్టర్లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడంలో భాగంగా 122 కిలోమీటర్ల మేర క్రాస్ క్లస్టర్ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ట్రెక్కింగ్‌కు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు కోర్ ట్రైల్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కొండచరియల బాటల స్థిరీకరణ, మార్గదర్శక సంకేతాలు, సులభం--మధ్యస్థం--కఠినం వంటి ట్రైల్ వర్గీకరణ, అడవి మరియు జలపాతం అనుసంధాన మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.పర్యావరణ పరిరక్షణతో కూడిన క్యాంపింగ్ ప్రాంతాలను గుర్తించాలని, ట్రెక్కింగ్ సందర్శకుల కోసం జియో-ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆధారిత ట్రైల్ మ్యాపింగ్, డిజిటల్ పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ట్రెక్కింగ్‌కు ముందస్తు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి చేయాలని, మోసే సామర్థ్యం ఆధారంగా రోజువారీ పరిమితులు విధించాలని సూచించారు. సందర్శకుల భద్రతకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర ఆశ్రయాలు, రెస్క్యూ పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.అరకు క్లస్టర్‌లో కాఫీ అనుభవ కేంద్రం, గాలికొండ వద్ద ఆస్ట్రో అబ్జర్వేటరీ, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్, రిజిస్ట్రేషన్ కేంద్రాలు, తాగునీరు, టాయిలెట్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రైల్ మార్గాల వెంట కాఫీ టేస్టింగ్ కియోస్కులు ఏర్పాటు చేయాలని తెలిపారు.అదేవిధంగా కమ్యూనిటీ టూరిజం అభివృద్ధిలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఓపెన్ ఎయిర్ థియేటర్లు, కమ్యూనిటీ కిచెన్లు, హస్తకళల వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు.అరకు, పాడేరు, లంబసింగి ప్రాంతాల్లో వాతావరణ పర్యవేక్షణ యూనిట్లు, సెంట్రల్ మానిటరింగ్ కేంద్రం, కారవాన్ పార్కులు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యాటక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన కలెక్టర్, ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు పర్యాటక గుర్తింపు పెరుగుతుందని, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. శేషగిరిరావు, అటవీ శాఖ అధికారులు, పర్యాటక శాఖ అధికారి దాసు, పంచాయతీరాజ్ ఇంజనీర్ దీప తదితరులు పాల్గొన్నారు.



## రేగిడి లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 20 పెన్ పవర్.** శ్రీ.శ్రీ.శ్రీ సింగార సారమ్మ మెగా క్రికెట్ టోర్నమెంట్ రేగిడి యూత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.గుమ్మలక్ష్మిపురం మండలం బాలేసు పంచాయితీ రేగిడి గ్రామంలో.గురువారం నాడు గ్రామ పెద్ద మరియు ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కొనుసు తిరుపతిరావు ప్రారంభించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.లోవముతా గిరిజన ప్రాంత యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడపై మక్కువ చూపించి ఉత్సాహంతో పాల్గొన్నలనదే ఈ క్రీడా యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు.టోర్నమెంట్ కు సుమారుగా 60 టీములు పాల్గొంటున్నారని, గెలుపొందిన వారికి మొదటి బహుమతి గా 20,000,రూపాయలు రెండవ బహుమతి 10,000 రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు.వారికి అన్ని విధాలైనటువంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తిరుపతి రావు అన్నారు.ఈ కార్యక్రమంలో రేగిడి పిహెచ్సి సిబ్బంది మరియు గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.ం

## శ్రీ.శ్రీ.శ్రీ పైడితల్లి అమ్మవారి కరుణ చల్లని దీవెనలు ప్రజలందరి పైన ఉండాలి - జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షులు వలిరెడ్డి



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 20.** చీపురుపల్లి పట్టణం రైల్వే కాలనీ లో వెలిసియున్న చల్లని దయగల తల్లి శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి 28 వ జాతర మహోత్సవం సందర్బంగా నిర్వాహకులు ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శనం చేసుకొన్న చీపురుపల్లి జడ్పీటీసీ ప్రతినిధి మరియు విజయనగరం జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అతనితో పాటు వైస్సార్సీపీ నాయకులు గవిడి సురేష్, ప్రభాత్ కుమార్,పతివాడ అఖిల్, డబ్బాడ ఆనంద్, వెంకీ, రాంకి తో కలిసి అమ్మవారికి ఆలయ అర్చకులుతో ప్రత్యేక పూజలు చేసిన అంతర ఆలయ కమిటీ వారు కండువా వేసి సత్కరించారు, అమ్మవారి ప్రసాదం అందజేశారు ఈ సందర్బంగా

మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారు మహిమగల అమ్మవారు అని కోరన కోరికలు తీర్చే చల్లని తల్లి అని అన్నారు

పైడితల్లి అమ్మవారు దయ కరుణ కటాక్షం చల్లని దీవెనలు ప్రజలు అందరి పై ఉండాలని కోరుకొన్నారు అని అన్నారు

## పేదలకు అన్నదానం...



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 20.** చీపురుపల్లి పట్నానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కోసూరు సన్యాసిరావు (73) జయంతి సందర్భంగా శుక్రవారం నాడు చీపురుపల్లి పట్టణంలో వారి కుమారులు కుమార్తె కోసూరు ప్రసాద్, కోసూరు సుధాకర్, కుమార్తె శ్రీలక్ష్మి లు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ శివ కోవెల సమీపంలోని పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని పంపిణీ. వారి తండ్రి కోసూరు సన్యాసిరావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఇటీవల ఫిబ్రవరి 20న ఈ ఏడాది ఆయన మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం ఉచిత అన్నదాని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు వారి స్నేహితులు రాజాన లక్ష్మణరావు, గట్టు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబులంలో విరగ్గాసిన వాటర్ ఆపిల్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 20:** అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో అరుదుగా పండే వాటర్ ఆపిల్ పంట మంచి ఫలితాలు ఇస్తోంది. జీకేవీధి మండలం ఏబులం గ్రామానికి చెందిన జనసేన పంచాయతీ కమిటీ అధ్యక్షుడు, పెసా కమిటీ కార్యదర్శి గబులంగి గణేష్ తన ఇంటి ప్రాంగణంలో మూడేళ్ల క్రితం వాటర్ ఆపిల్ మొక్కను నాటారు.నాటిన ఏడాది తర్వాతే చెట్టు దిగుబడిని ఇవ్వడం ప్రారంభించగా, గత రెండేళ్లుగా సమృద్ధిగా పండ్లు ఇస్తోంది. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో చెట్టుకు కాయలు విరగాసినట్లు గణేష్ తెలిపారు.సాధారణంగా అతి శీతాల ప్రాంతాల్లో మాత్రమే పెరిగే ఈ పంట మన్యంలో కూడా విజయవంతంగా సాగవుతుండటం స్థానిక రైతుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# జాబ్ క్యాలెండర్ గోడ పత్రికను ఆవిష్కరించిన పల్లా



**గాజువాక పెన్ పవర్, మార్చి 20:** పారిశ్రామిక ప్రాంతం గాజువాకా తెలుగు యువత ఆధ్వర్యంలో జాబ్ క్యాలెండర్ పోస్టర్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. గాజువాక తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేసారు. రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగావకాశాలపై స్పష్టత ఇవ్వడం ద్వారా భవిష్యత్తుపై నమ్మకం పెంచిన ఈ నిర్ణయం అభినందనీయం అని తెలియజేశారు. గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు మానాపురం గణపతి మాట్లాడుతూ

జాబ్ క్యాలెండర్ విడుదలతో యువతలో ఉత్సాహం, ఆశలు మరింత పెరిగాయి.యువత సమస్యలను అర్థం చేసుకుని, సమయానుకూలంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి మా ధన్యవాదాలు. ముఖ్యంగా యువత అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్న నారా లోకేష్ నాయకత్వం ప్రశంసనీయం అన్నారు. భవిష్యత్తులో కూడా యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా మరిన్ని చర్యలు తీసుకోవాలని యువత తరుపున అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వియ్యపు నరేష్, ఉపాధ్యక్షులు రమేష్, లోకేష్, హేమంత్, సాయి వర్మ, చదరం తులసీరామ్, గుప్త, తేజ, తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియకాల చట్టం చేయాలి

**ఆదివాసీ సత్యాగ్రహ యాత్రలో జెఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజుబాబు డిమాండ్**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,మార్చి 20:** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యో నియమకాల చట్టం చేయాలని ఏప్రిల్ 3 న పాడేరులో జరిగే ఆదివాసీ సత్య గ్రహయాత్ర భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు,అల్లూరి సీతరామరాజు జిల్లా చైర్మన్ రామరావుదొర పిలుపునిచ్చారు. ?మండలంలోని దేరాల గ్రామం నుంచి ఆదివాసి సత్యాగ్రహ యాత్రను ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రామరావుదొర మాట్లాడుతూ సత్య గ్రహయాత్ర ?ఈ రోజుతో 130 వ రోజుకు చేరుకుందని, రాష్ట్రంలో అనేక గ్రామాలను పర్యటిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకల చట్టం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని,

?ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భాల్లో ఆదివాసి ప్రాంతాల పర్యటన లో హామీ ఇచ్చి ఇప్పుడు మరిచిపోయారన్నారు. 2025 ఆగస్టు 9 న పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ చట్టం చేస్తామని ఆదివాసి జేఏసీకి, ఆదివాసులకు హామీ ఇచ్చారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేసేంతవరకు ఆదివాసులందరూ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.?ఈ చట్టం చేయడం ఆదివాసులకు చారిత్రక అవసరమే కాదు కూటమి ప్రభుత్వం యొక్క గురుతర బాధ్యత కూడా అని రామారావు దొర అన్నారు. అలాగే ఏజెన్సీ చట్టాలు రాజ్యాంగ పరిధులు పరిగణలోకి తీసుకొని షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం కూర్పు లో స్టేట్ కేడర్ పోస్టులలో 30శాతం, జోనల్ కేడర్ పోస్టులలో 50శాతం, లోకల్ కేడర్ పోస్టులన్నిటిని స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసే విధంగా సమగ్రమైన చట్టం చేయాలని పలుదఫాలుగా ప్రభుత్వం తో జరిపిన చర్చలలో ఆదివాసి జేఏసీ స్పష్టం చేసింది,ఇప్పటికైనా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మరో మారు ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆదివాసి జేఏసీ హెచ్చరిస్తుంది. కావున కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే , షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే ఆదివాసి జేఏసీ ఉద్యమాలు తీవ్రతరం చేసి ప్రభుత్వానికి డిమాండ్ చేస్తామని హెచ్చరించారు.ఆదివాసీ జెఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు మాట్లాడుతూ జిఓ నెంబర్ 3 రద్దు చేయడంతో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందని, గిరిజన సలహా మండలి (టిఎసి)ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ చట్టాలైనా భూబదాలయింపు నిషేధ చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ చట్టాలను సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేసారు.?ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసీ నాయకులు లకే రామచంద్రుడు,జెఏసి మీడియా ప్రతినిధి మరియు గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, పార్థసారథి,స్వామి మరియు మొట్టడం రామరావు, వనపల జోగిరాజు,లకే ఈశ్వరి, వనపల దేవేంద్రతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.డేరాల, గూడెం కోలనీ, ఆర్వీనగర్, వంచుల, కొత్తపాలెం, జర్రెల, మొండిగెడ్డ,రింతాడ, సంకాడ, పెదవలస,డొకులూరు,లక్కవరపుపేట, దేవరాపల్లి తో పాటు వివిధ గ్రామాలకు ఆదివాసి సత్యాగ్రహ యాత్ర రథం వెళ్లి ఏప్రిల్ 3 వ తారీకున పాడేరులో జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని ప్రచారం చేసారు.

# ఆనందపురం ట్రాఫిక్‌కు చెక్



**సమగ్ర ప్రణాళికకు అధికారుల ఆదేశం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 20 :** నగర పరిధిలో కీలక కూడలి అయిన ఆనంద పురం జంక్షన్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య లను దృష్టిలో ఉంచుకుని, ముందస్తు చర్యలతో సమగ్ర ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయా లని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్‌హె చ్ఏఐ అధికారులకు స్పష్టం చేశారు.శు క్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆనం దపురం కూడలిని పరిశీలించిన వారు, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ రద్దీ మరింత పెరగకుండా ముందుగానే వ్యూహాత్మక చర్యలు తీసుకోవా లని సూచించారు. తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేసి, దశలవారీగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రస్తుతం ఉన్న ఒత్తిడిని తగ్గించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పూల మార్కెట్‌ను సమీపంలోని రైతు బజార్‌కు కేటాయించిన 95 సెంట్ల స్థలానికి తరలించే అం శాన్ని పరిశీలించారు. అదనంగా, పక్కనే ఉన్న ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని వినియోగించే అవకా శాలను కూడా అధ్యయనం చేయాలని నిర్ణ యించారు.ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వాహన రాకపోకల ధోరణిని సమ గ్రంగా విశ్లేషించి శాశ్వత ప్రణాళిక రూపొందిం చాలని అధికారులకు హితవు పలికారు.

ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎన్‌హెచ్ఏఐ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఆధార్,అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 20:** గూడెం కొత్తవీధి మండలంలోని పెదవలస గ్రామంలో ఎంపీడీవో బి హెచ్ వి రమణబాబు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ పర్యటనలో భాగంగా స్థానిక సచివాలయంలో కొనసాగుతున్న ఆధార్ సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ కేంద్రానికి గిరిజనులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్నట్లు ఆయన గుర్తించారు. ప్రతిరోజూ ఆధార్ కేంద్రాన్ని తప్పనిసరిగా నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. సేవల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజల నుంచి ఎలాంటి వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తరువాత అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఆయన,పిల్లలకు అందిస్తున్న వండిన ఆహారాన్ని రుచి చూశారు. పిల్లలకు పోషకాహారంతో పాటు ఆటపాటల ద్వారా ప్రీ-స్కూల్ విద్యను అందించాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సపగెడ్డ ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన అనాధ బిడ్డలకు కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

- జిల్లా కలెక్టర్ గారు ఐటిడి పి ఓ గారు తక్షణమే స్పందించాలి.
- కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ మెంబర్ పాచిపెంట చిన్నస్వామి.



**అరకులోయ పెన్ పవర్ 20 :** అల్లూరి జిల్లా అరకు వేలి నియోజకవర్గం హుకుంపేట మండలం రాప గ్రామంలో గోమంగి సత్తిబాబు సుమారు 6 సంవత్సరాల క్రితం మరణించడం జరిగింది. గోమంగి రాములమ్మ ఆరు నెలల క్రితం మరణించడంతో వీరి పిల్లలు నలుగురు అక్క చెల్లెలు అనాధగా దీనస్థితి మిగిలిపోయారు మొదటి పాప గోమంగి అంజలి, రెండో పాప గోమంగి ప్రియాంక, మూడోపాప గోమంగి లావణ్య, నాలుగోపాప గోమంగి జాస్మిన్, తల్లితండ్రులు కోల్పోవడంతో ఏ పని చేయాలో ఏం తినాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అనాధ బిడ్డల సమాచారం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ తరఫున వచ్చి మనోధైర్యాన్ని నింపి వాళ్ళకి భరోసా ధైర్యము ఇవ్వడం జరిగిం. మా వంతు మాకు కలిగిన చిరు సహాయం చేయడం జరిగింది ఎవరైనా దాతలు నేరుగా రాప గ్రామంలో వచ్చి గిరిజన అనాధ బిడ్డలకు సహాయ సహకారాలు అందించగలరని మనవి చేశారు. అనాధ బిడ్డలకు కూటమి రాష్ట్ర ప్రభుత్వము అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి విద్య ,కుడు, గూడు,అభివృద్ధి జీవితాంతం గిరిజన బిడ్డలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు భాను సిహెచ్ రావు, గంపరాయి ప్రజలు పాల్గొన్నారు.

# అక్కరమాని కుటుంబంలో నిశ్చితార్థ వేడుకలు

**సిరమ్మ పాల్గొని ఆశీర్వాదాలు**




**భీమిలి, పెన్ పవర్, మార్చి 20 :** విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలో అక్కరమాని కుటుంబంలో నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. భీమి లి జోన్ జీవీఎంసీ 2వ వార్డు వైసీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని మంగరాజు మూడవ కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమం సన్నిహితులు, పార్టీ నాయకుల సమక్షంలో ఆనందంగా జరి గింది.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియో జకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్య క్షురాలు సిరమ్మ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్ట మూరు సతీష్, జీవీఎంసీ 1వ వార్డు కార్పొరేటర్ పద్మావతి రామునాయుడు, 2వ వార్డు అధ్యక్షు డు చిల్ల భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు జీరు వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యక ర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బీజేపీ జిల్లా గిరిజన మోర్చా పదవుల నియామకం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 20 :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు పార్టీ పదవులు కేటాయించారు. జిల్లా గిరిజన మోర్చా కార్యదర్శిగా మొట్టడం లక్ష్మణ్‌ను, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మత్స్యరాస రామ్‌కిరణ్ కుమార్‌ను నియమిస్తూ పార్టీ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది.పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులను గౌరవించే భాగంగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి ఆదేశాల ప్రకారం జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు లకే అబ్బాయి దొర సమాచారం అందించారు.బీజేపీ గూడెం కొత్తవీధి మండల అధ్యక్షుడు కాకురు శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ నియామకాలను ప్రకటించారు.

## డ్రోన్ కెమెరాతో పహారా.. ఎస్సై దామోదర్



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 20.** శ్రీ గౌరవ ఎస్ పి గారి సూచనలు మేరకు ఈరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి 6 గంటల వరకు చీపురుపల్లి టౌన్ ఏరియాకు సంబంధించి గుడ్లవాని చెరువు మెట్ట కాలనీ ఏరియాలలో డ్రోన్ కెమెరాతో పహారా చేయించి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించే పనిలో భాగంగా ఓపెన్ డ్రింకింగ్ చేసిన వారిపై 12 మందిపై కేసులను బుక్ చేయడం జరిగింది .వీరిని చట్టపరంగా కోర్టులో ప్రవేశపెట్టే పెట్టటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎల్ .దామోదర్ రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఇందుమూలముగా తెలియపరుచున్నది ఏమనగా చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు అనగా పేకాట ఆడటం ,బహిరంగంగా మందు తాగటం , జనం గుమిగుడి అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించడం, వారిని చట్టపరంగా కోర్టులో ప్రవేశ పెట్టడం జరుగుతుంది అని దీనిని గమనించవలసిందిగా కోరడమైనది.

## కాఫీ రైతులకు న్యాయం చేయాలి.. జిసిసి ఎదుట ఆందోళన

**కొనుగోళ్లలో నిర్లక్ష్యం.. జిసిసిపై కాఫీ రైతుల నిరసన**

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, మార్చి 20:** కాఫీ రైతుల నుంచి జిసిసి సంస్థ తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న జీకే వీధి జిసిసి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మండలంలోని గిరిజన కాఫీ రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రభుత్వ సంస్థ అయిన జిసిసి ఈ ఏడాది చెర్రీ కాఫీకి కేజీకి రూ.270 ధర ప్రకటించినప్పటికీ, రైతుల నుంచి కొనుగోళ్లు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. దీంతో రైతులు దళారుల వద్ద తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోందని, తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జిసిసి అధికారులు లక్ష్యాలు పూర్తయ్యాయని, రుణాలు పొందిన రైతుల నుంచే కొనుగోళ్లు జరుగుతున్నాయని చెబుతున్నారని, అయితే ఇది వాస్తవానికి విరుద్ధమని విమర్శించారు. మండలంలో ఏ గ్రామంలో ఎంతమంది రైతుల నుంచి, ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేశారో పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.జిసిసి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఈ సందర్భంగా పలు డిమాండ్లు చేశారు.ప్రకటించిన ధరకు తక్షణమే కాఫీ కొనుగోళ్లు చేపట్టాలి,రైతులకు ఇచ్చిన రుణాలను రద్దు చేయాలి, మండలంలో జరిగిన కొనుగోళ్లపై పూర్తి వివరాలు వెల్లడించాలి రైతుల సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగుతుందని బుజ్జిబాబు హెచ్చరించారు.



# వైభవంగా శ్రీశ్రీశ్రీ భావనాఋషి భద్రావతిల పూజా మహోత్సవం

**శ్రీ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ**




**విశాఖ తూర్పు,పెన్ పవర్,మార్చి 20:** జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్ లో పద్మశాలి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా శ్రీశ్రీశ్రీ పవనా ఋషి పద్మావతి ల పూజా మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు ఎనిమిది వందల మంది పద్మశాలి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు పాల్గొని కార్యక్రమ విశేషాలు అడిగి తెలుసుకుని నిర్వాహకులను అభినందించి పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారికి పండుగ మరియు ఉగాది శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు.అనంతరం అన్న సమారాధనలో టిడిపి 11వ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు.కాళ్ల శంకర్,11 వ వార్డుటిడిపి నాయకులు కాకి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో సందర్శకులకు శుద్ధజలం

✷ ఉద్యోగ భవన్, గురజాడలో ఆర్వో ప్లాంట్ల ప్రారంభం





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 20 :** నగరానికి వచ్చే సందర్శకులు, కార్యాలయాలకు విచ్చేసే ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటు లో ఉంచేందుకు వీఎంఆర్‌డీఏ కీలక చర్యలు చేపట్టింది. ఉద్యోగ భవన్, చిల్డ్రన్ ఏరినా, గుర జాడ కళాక్షేత్రం ప్రాంగణాల్లో ఆధునిక ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభిం చారు.వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్, ఐఏఎస్ కలిసి ఈ ప్లాంట్లను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవి కాలంలో సందర్శకుల దాహార్తిని తీర్చేందు కు శుద్ధజల సదుపాయం అత్యంత అవసరమ ని పేర్కొన్నారు. సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ లో భాగంగా డివీస్ సంస్థ ఒక్కో ప్లాంట్‌ను సు మారు రూ. 8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయ డం అభినందనీయమని తెలిపారు.ఉద్యోగ భవన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయా లు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తుంటారని, వారందరికీ చల్లటి, రక్షిత తాగునీరు అందేలా ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉగాది పండుగ సందర్భం గా ఈ సదుపాయాలను ప్రారంభించడం సంతో షకరమని అన్నారు.విశాఖపట్నాన్ని పర్యాటక రాజధానిగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, పర్యాటకులకు మెరుగైన సౌక ర్యాలు కల్పించేందుకు వీఎంఆర్‌డీఏ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూ దనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ జేసీపీ సింగ్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ు

## లింగవరం గ్రామంలో నీటి సరఫరా మెరుగుదల చర్యలు

**దామన పల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చి 20:** జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీలో లింగవరం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో కొత్త మోటారు బిగింపు పనులు చేపట్టారు.వర్షం, చీకటి వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా సిబ్బంది బోర్‌కు కొత్త మోటారు ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపరచినట్లు తెలిపారు.గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ రామకృష్ణ పేర్కొన్నారు. తన పదవీకాలం ముగిసే దశలో ఉన్నప్పటికీ, గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవికాలంలో నీటి సమస్యలు అధికంగా ఉంటాయని, అందుకే ముందస్తుగా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే, స్పెషల్ ఆఫీసర్ పాలన సమయంలో పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యక్ష పర్యవేక్షణ తగ్గే అవకాశం ఉన్నందున, ఈ సమయంలో గ్రామంలో తలెత్తే చిన్న చిన్న అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## మన్యంలో న్యాయ పోరాట దీక్షలు ప్రభుత్వానికి పట్టవా.



**గుమ్మలక్ష్మీపురం. కొమరాడ.మార్చి 20 పెన్ పవర్.**కొమరాడ మండలం,పూజారి గూడా గ్రామంలో ఆప్సాస్ మరియు ఐటిడిఎస్,ఎం.జి.ఎస్.ఎస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయ పోరాట దీక్షలు పదో రోజు కొనసాగింది.దీక్ష కార్యక్రమంలో గురువారం నాడు అప్పస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం పాల్గొన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.దీక్షలకు గల కారణం మార్చి 11.2026 రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఐటిడిఏ పరిధిలో ఉన్న 216 పంచాయితీలు 1496 షెడ్యూలు గిరిజన గ్రామాలను గిరిజన సంక్షేమ శాఖ అధికారిక వెబ్సైట్లో పొందుపరచాలని అలాగే రాష్ట్రంలో ఉన్న 595 షెడ్యూలు పంచాయితీ పరిధిలోగల 878 రెవెన్యూ షెడ్యూల్ గ్రామాలను కూడా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ అధికారిక వెబ్సైట్లో పొందుపరచాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారి చేసి ఉన్నారు.ఆయన తెలిపారు.ఈ తీర్పును అనుసరించి తక్షణమే అధికారులు స్పందించాలని గిరిజన స్వచ్ఛంద సంస్థల ద్వారా జగ్గు దొర వలస గ్రామంలో న్యాయపోరాట నిరాహార దీక్షలు గత పది రోజులుగా కొనసాగిస్తున్నామన్నారుఈ దీక్షలకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు కంద్రక మల్లేష్ పర్యటించి దీక్షలో ఉన్న గిరిజన సంఘ నాయకులతో న్యాయ పోరాట దీక్షలకు గలకారణాలు అడిగి తెలుసుకున్నారు.మీ సమస్యను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి అలాగే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరయ్యే విధంగా కృషి చేస్తానని మల్లేష్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ఏరియా ఆదివాసి సంఘం అధ్యక్షులు నిమ్మక సింహాచలం,మన్యం గిరిజన సేవా సంఘం అధ్యక్షులు.మంచాల ఈశ్వరరావు,మరియు సంఘ సభ్యులు గిరిజనులు,కే.గోపి,హెచ్ గంగాధర్,సర్పంచ్ మల్లయ్య,బి రమేష్,కిషోర్,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ సంపర్క్

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ముందడుగు





**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 20 :** పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన ఎస్పీ సంపర్క్ ఫోన్-ఇన్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బంది నేరుగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో మాట్లాడే అవకాశం పొందుతున్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో, జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేస్తున్నారు. ముఖ్యంగా పోస్టింగులు, బదిలీలు, సెలవులు, కుటుంబ ఆరోగ్య సమస్యలపై తమ ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది సమస్యలను స్వయంగా వినిపించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాయకత్వం మరియు సిబ్బంది మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడంలో ఈ కార్యక్రమం కీలకంగా మారింది. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ "సిబ్బంది సమస్యల పరిష్కారం మా మొదటి ప్రాధాన్యత. ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా తమ సమస్యలను నాకు తెలియజేయవచ్చు. ప్రతి ఫిర్యాదును గోప్యంగా ఉంచి త్వరితగతిన పరిష్కరిస్తాం," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్సై ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆసరాడ గ్రామస్తుల భూవివాదం పరిష్కారం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 20:** మండలంలోని రింతాడ పంచాయతీ ఆసరాడ గ్రామానికి సంబంధించిన భూవివాదం (దేశ్‌గిరి నారాయణమ్మ వర్సెస్ బాలయ్యపాడల్ )ను తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి కోఆర్డినేషన్ కమిటీ విచారణలో పరిష్కరించారు. గూడెం కొత్తవీధి మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎస్సై సురేష్,ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు,వీఆర్వో కృష్ణారావు హాజరయ్యారు. ఇరు పక్షాల వాదనలు విన్న అధికారులు సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.సర్వే పూర్తి అయిన తరువాత మ్యూటేషన్ ప్రక్రియను చేపడతామని అధికారులు వెల్లడించారు. దీంతో వివాదానికి పరిష్కారం లభించినట్లు సమాచారం.

# 'వజ్రప్రహార్'లో మెగా కార్డన్ సెర్చ్






**పెన్ పవర్ ,చింతపల్లి,మార్చి 20:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా శుక్రవారం అన్ని జిల్లాల పోలీసు సబ్‌డివిజన్లలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ఈగల్ చీఫ్ ఏకే రవికృష్ణ పర్యవేక్షణలో, జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎస్పీ అమిత్ బర్దర్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి సబ్‌డివిజన్‌లో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బృందాలు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లు, పాత గంజాయి, నార్కోటిక్ కేసుల్లో ఉన్న ముద్దాయిలపై దృష్టి సారించారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా 80 ఇళ్లను, 20 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 7 వాహనాలను గుర్తించారు. పాత కేసులకు సంబంధించిన 10 మంది ముద్దాయిలను గుర్తించి పర్యవేక్షణలోకి తీసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో ఉండాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి తదితర మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో భాగంగా పోలీసులు, సిబ్బంది, ప్రజలతో కలిసి 'వజ్రప్రహార్ ప్రతిజ్ఞ' నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## చట్టపల్లి గ్రామస్తులకు ఇళ్ల మంజూరుపై డిమాండ్



బీజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు రీమల రాజేశ్వరి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 20:**మండలంలోని గాలికొండ పంచాయతీ పరిధిలోని చట్టపల్లి గ్రామానికి తుఫాన్ కారణంగా జరిగిన నష్టం నేపథ్యంలో తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు, గూడెం కొత్తవీధి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి డిమాండ్ చేశారు.2024 డిసెంబర్ 8న సంభవించిన తుఫాన్ వల్ల గ్రామంలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రభుత్వం 36 ఇళ్లతో మోడల్ కాలనీ మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు గానీ, నిర్మాణ పనులు గానీ ప్రారంభం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు తమ సొంతంగా ఇళ్లు నిర్మించుకోవాలనుకున్నా ఇంటి స్థలాలు కూడా అందుబాటులో లేవని తెలిపారు. తక్షణమే మోడల్ కాలనీ మంజూరు చేసి లేదా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై ) కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తుఫాన్‌లో మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి, అలాగే గాయపడి అవయవాలు కోల్పోయిన కొర్ర రామన్న కుటుంబానికి ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.తుఫాన్ ప్రభావంతో గ్రామ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, అధికారుల పరిశీలనలో గ్రామ మధ్యలో కల్వర్టు నిర్మాణం అవసరమని తేలిందని తెలిపారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే గ్రామానికి మరింత ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపల్లి గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని రీమల రాజేశ్వరి కోరారు.



## భారీ గంజాయి రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు రూ.1లక్ష జరిమానా

- చోడవరం కోర్టు చారిత్రాత్మక తీర్పు విధింపు
- అనకాపల్లి పోలీసుల కృషికి ఫలితం



**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 20 :** గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి జిల్లా పోలీసులు సాగిస్తున్న కఠిన చర్యలకు మరో కీలక విజయం లభించింది. 2015లో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో ప్రధాన నిందితుడికి చోడవరం తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. చోడవరం కోర్టు గౌరవ న్యాయమూర్తి ఎం.హరినారాయణ కేసులో సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించి నిందితుడు కోరుకొండ అప్పల పాత్రుడు (రాజు) 32, విజయనగరం జిల్లా నేరానికి పాల్పడినట్లు నిర్ధారించారు. దీనితో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధించారు.

జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.

ఈ కేసు 16 జూలై 2015న చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ సమీపంలో అప్పటి సబ్-ఇన్‌స్పెక్టర్ బి.రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో లారీ మరియు మోటార్ సైకిల్ ద్వారా తరలిస్తున్న 175 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు నిందితులపై ఎన్డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. క్రైమ్ నెం.102/2015,

ఇంకా పరారీలో నిందితుడు. ఈ కేసులో రెండో నిందితుడు కిల్లో బాబురావు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతనిపై ఎన్బిడబ్ల్యు (నాన్ బైబుల్ వారెంట్) పెండింగ్‌లో ఉండగా, కేసును వేరు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ చీపురుపల్లి సూర్యనారాయణ గారు సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది మరియు దర్యాప్తు అధికారులు కూడా కీలక పాత్ర పోషించారు. ఎస్పీ అభినందనలు కఠిన హెచ్చరిక జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసు సిబ్బంది మరియు న్యాయ విభాగాన్ని అభినందించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

## గోపాలపట్నం రైతు బజార్‌లో నిజాయితీకి నిదర్శనం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 20 :** విశాఖ నగర పరిధిలోని గోపాలపట్నం రైతు బజార్‌లో ఈరోజు జరిగిన ఒక సంఘటన అక్కడి రైతుల నిజాయితీని ప్రతిబింబించింది. వేపగుంటకు చెందిన వినియోగదారుడు పప్పు శ్రీనివాసరావు రైతు బజార్‌కు వచ్చి కొనుగోళ్లు చేసి ఇంటికి వెళ్లిన అనంతరం తన మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే తిరిగి రైతు బజార్‌కు చేరుకుని ఫోన్ కోసం విచారించాడు.

ఇదే సమయంలో, ఒక రైతు తన స్టాల్ వద్ద ఎవరో ఫోన్ మర్చిపోయారని గమనించి, దానిని స్వాధీనం చేసుకుని నిజాయితీగా ఎస్టేట్ అధికారికి అప్పగించాడు. ఎస్టేట్ ఆఫీసర్ జి. ప్రసాద్ ఫోన్‌ను భద్రంగా ఉంచి, రైతు కమిటీ సభ్యుడు రామన్నపాత్రుడు సమక్షంలో సంబంధిత వినియోగదారునికి అందజేశారు.

తన ఫోన్ సురక్షితంగా తిరిగి లభించడంతో పప్పు శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేస్తూ రైతు మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన రైతు బజార్‌లో పనిచేస్తున్న రైతుల నిబద్ధత, నిజాయితీకి మంచి ఉదాహరణగా నిలిచింది. స్థానిక ప్రజలు కూడా ఈ చర్యను ప్రశంసిస్తూ, ఇలాంటి విలువలు సమాజంలో మరింత పెరగాలని ఆకాంక్షించారు.

## ట్రై కార్ రుణాల ద్వారా గిరిజనులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

- ట్రైకార్ ఎండీ ని కలసి విన్నవించిన ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 20:** గిరిజనులకు రుణాలు అందించి ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు తెలిపారు. అరకులోయ వచ్చిన ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ ఎండి మణికుమార్ ను ఆయన కలసి రుణాల అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన యువతతో పాటు, గిరిజన రైతులకు ట్రైకార్ ద్వారా రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగులకు రుణాలు అందించి పారిశ్రామికంగా వారిని అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తామన్నారు. గతంలో రుణాలు అందాలంటే గిరిజనులు ఎంతో ఇబ్బందులు పడేవారిని తెలిపారు. ఆ ఇబ్బందులు లేకుండా రుణాలు అందించేలా కృషి చేస్తామన్నారు.ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డొంబునాయుడు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బలరాం, అరకు మండల కార్యదర్శి దేవ పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి భారీ బూస్ట్





✷ అనకాపల్లిలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 20 :** ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఈ ప్రాజెక్టు విశేషాలను వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఆర్కలర్మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఆధ్వర్యంలో ఈ భారీ ప్రాజెక్టు చేపట్టబడుతోంది. మార్చి 23, 2026న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. అనకాపల్లి జిల్లాలోని బంగారయ్యపేట, నక్కపల్లి ప్రాంతాల్లో సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఇది దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్రాజెక్ట్‌గా నిలవనుంది.

విస్తీర్ణం సుమారు 2,200 ఎకరాలు

ప్రారంభ సామర్థ్యం, 7.3 మిలియన్ టన్నులు

లక్ష్య సామర్థ్యం, 17.8 మిలియన్ టన్నులు

లక్ష్యం:శ్రీ, 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభం.

ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో 30,000 ఉద్యోగాలు, మొత్తం 55,000 ప్రత్యక్ష ఒ పరోక్ష ఉద్యోగాలు, ఉత్తరాంధ్ర యువతకు ఇది ఒక పెద్ద అవకాశంగా భావిస్తున్నారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుతో పాటు పలు కీలక పెట్టుబడులు కూడా ప్రాంత అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. ఎర్త్ మూవర్స్ ప్రాజెక్ట్ రూ.1,234 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, రూ.784 కోట్లు, భవిష్యత్ ప్రాజెక్టులు గ్రీన్ హైడ్రోజన్ సిటీ, క్లీన్ టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ మెడ్ టెక్ జోన్లు వస్తాయన్నారు. సముద్ర తీరానికి సమీపం, భూమి లభ్యత వంటి అనుకూలతల వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా మారుతోందని గణబాబు తెలిపారు. ఈ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాయకుల కృషికి ప్రశంసలు, ఈ భారీ పెట్టుబడి సాధ్యమవ్వడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ కృషి ఎంతో కీలకమని గణబాబు కొనియాడారు. అనకాపల్లిలో ఏర్పాటు కానున్న ఈ మెగా స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశను నిర్దేశించనుంది. పారిశ్రామికంగా ప్రాంతాన్ని దేశ పటంలో ప్రముఖ స్థాయికి తీసుకెళ్లే శక్తి ఈ ప్రాజెక్టుకు ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## అక్రమ గంజాయి పట్టివేత - ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

✷ 50 కేజీల గంజాయి స్వాధీనం.

✷ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్. అభిషేక్.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 20.** అల్లూరి సీతారామరాజు జిల్లా,

ముంచింగిపుట్టు మండలంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి వ్యక్తుల అరెస్ట్ చేసి 50 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పాడేరు డీఎస్పీ ఆర్ అభిషేక్ తెలిపారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించాలనే జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)ఆదేశాల మేరకు చేపట్టిన ఆపరేషన్ వజ్ర ప్రహార్ లో భాగంగా, శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాడేరు డీఎస్పీ అభిషేక్ కీలక వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా గంజాయి సాగు లేదని, అయితే అంతర్రాష్ట్ర స్మగ్లర్లు మన జిల్లా సరిహద్దులను కేవలం రవాణా మార్గంగా వాడుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ముంచంగిపుట్టు ఎస్.ఐ తో పాటు సిబ్బంది లబ్బురు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, బైక్‌పై పారిపోవడానికి ప్రయత్నించిన నరసింగ్ (ఎ-2 ) అనే వ్యక్తిని చాకచక్యంగా పట్టుకోగా, అతని సమాచారం మేరకు జోలపుట్టు సమీపంలో భీమా (ఎ-1) అనే వ్యక్తిను అదుపులోకి తీసుకోని కోర్టులో హాజరుపర్చి విశాఖపట్నం సెంట్రల్ జైలు కి పంపిశీచడం జరిగింది అని తెలిపారు. వీరి విచారణలో ఒడిశాలోని పనసపుట్టు, జనబ, జంత్రి, తాబేరు పరిసర ప్రాంతాలలో నుండి గంజాయిని సేకరించి, అక్కడి నుండి ముంచంగిపుట్టు మండలంలోని బుంగపుట్టు మరియు లబ్బురు గ్రామాల మీదుగా జోలపుట్టును కేంద్రంగా చేసుకుని, అక్కడి నుండి ఒడిశాలోని జైపూర్ కు అక్రమంగా తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. జైపూర్ కేంద్రశీ గా ఈ అక్రమ గంజాయి వ్యాపారము సాగుతుందనీ, నిందితుల నుండి 50 కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసు కున్నామన్నారు. పొరుగు రాష్ట్ర అధికారుల సమన్వయంతో ఇలాంటి రవాణా నెట్‌వర్క్‌లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాడేరు డీఎస్పీ హెచ్చరించారు.

## అనకాపల్లి జిల్లాలో భారీ భద్రతా ఏర్పాట్లు





✷ ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ

✷ కట్టుదిట్టమైన ప్రణాళిక జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**నక్కపల్లి, పెన్ పవర్, మార్చి 20 :** స్థానిక అనకాపల్లి జిల్లాలో ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాజెక్ట్‌గా భావిస్తున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ (ఏయం/ఎన్ఎస్) ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం కోసం పోలీస్ శాఖ విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ కార్యక్రమం ఈ నెల 23న నక్కపల్లి మండలం చందనాడ గ్రామ పరిధిలోని తమ్మయ్యపేట వద్ద జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ నిర్మాణం, బారికేడింగ్ పనులు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో అత్యున్నత స్థాయి జెడ్ ం కేటగిరీ భద్రత అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. జాతీయ రహదారిపై సాధారణ రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని ఐజీ సూచించారు. కార్యక్రమానికి వచ్చే వాహనాల కోసం వేర్వేరు మార్గాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి కీలక ఘట్టం

ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధికి ఇది దోహదపడనుంది. ఈ నేపథ్యంలో కార్యక్రమం ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఐజీ గోపినాథ్ జట్టి సూచించారు. పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఈ పర్యటనలో అదనపు ఎస్పీలు ఎం. దేవ ప్రసాద్, ఎల్. మోహనరావు, ఎస్‌బి డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు ఎం. శ్రావణి, వి. విష్ణు స్వరూప్, సీఐలు బాల సూర్యారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి గ్రీవెన్స్‌కు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి: జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 20:** ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43 అర్జీలు రాగా, రెవెన్యూ క్లినిక్‌లో 9 వినతులు అందాయి. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఇంచార్జి డీఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.భూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా సమస్యలు పరిష్కరించబడతాయని చెప్పారు.అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించి, గ్రీవెన్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి క్లోజ్ చేయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తే జిల్లా స్థాయిలో ఫిర్యాదులు తగ్గుతాయని అన్నారు.ప్రజలు తమ సమస్యల కోసం 1100 కాల్ సెంటర్ లేదా మీకోసం.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన ఫిర్యాదులు అందాయి. తరిగిడి గ్రామస్తులు మంచినీటి సౌకర్యం కోరగా, చిన్నతంబులు గ్రామానికి చెందిన వ్యక్తి భూ సమస్యపై ఫిర్యాదు చేశాడు. గుత్తులపుట్టు గ్రామానికి చెందిన మహిళ భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. జీకే వీధి, అనంతగిరి తదితర మండలాల్లో సిసి రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె.పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి . కృష్ణ మూర్తి నాయక్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, పలువురు తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ వైఎస్సార్‌సీపీ బలోపేతంపై దృష్టి

✷ సమన్వయకర్తలు, పరిశీలకుల కీలక సమావేశం





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 20 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం, వ్యవస్థీకరణ మరియు డిజిటల్ పరిపాలనపై దృష్టి సారిస్తూ కీలక సమావేశం జరిగింది. మద్దిలపాలెంలోని కృష్ణ కాలేజ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు విస్తృతంగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో పార్టీ నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేయ డం, కార్యకర్తల సమన్వయాన్ని పెంపొందించ డం, ఆధునిక సాంకేతికతను వినియోగించి డిజి టల్ పరిపాలనను మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు.విశాఖపట్నం పార్లమెంట్ పరిశీ లకులు కదిరి బాబురావు, జిల్లా పార్టీ అధ్య క్షుడు కె.కె. రాజు మాట్లాడుతూ, పార్టీ కార్యకలా పాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత చురుకుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సమన్వయకర్తలు మళ్ళ విజయ ప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు పాల్గొనగా, పరిశీలకులు పసుపులేటి బాల రాజు, కొత్తగుల్లి భాగ్యలక్ష్మీ, సిఎంఎ జహీర్ అహ్మద్, చింతకాయల సన్యాసిపాత్రుడు, వీసం రామకృష్ణ, సతీష్ వర్మ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ పట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖ పట్నం తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి ఈ సమావేశం లో పాల్గొని పార్టీ బలోపేతానికి మహిళా విభాగం పాత్రను మరింత విస్తరించాలని సూచించారు.

## పేదల పక్షాన ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**బిమిలి, పెన్ పవర్, మార్చి 20 :** పేద ప్రజలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి ద్వారా విడుద లైన రూ. 7.43 లక్షల విలువైన చెక్కులను భీ మిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఆనందపురం, పద్మనాభం మండలాలు మరి యు జీవీఎంసీ 1, 5వ వార్డులకు చెందిన మొత్తం 9 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో చికి త్స పొందిన బాధితులకు ఈ ఆర్థిక సాయం అందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ, పేదల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పె ట్టుకుని ప్రభుత్వం ఎల్లప్పుడూ సహాయ సహకా రాలు అందిస్తుందని తెలిపారు.గతంతో పోలిస్తే సీఎం సహాయనిధి మంజూరు ప్రక్రియ వేగవం తంగా సాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సమయానికి సహాయం అందేలా చర్యలు తీసు కుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామస్వామి నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజ య్ బాబు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, తమ్మిన సూరిబాబు, కోరాడ రమ ణ, కసిరెడ్డి దామోదరరావు, దండి వెంకటేష్, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, కాకర రమణ, కురు మిన లీలావతి, సూరాల సత్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కడుతులలో రైతన్న మీకోసం కార్యక్రమం



- ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలి.
- హార్టికల్చర్ అసిస్టెంట్ శోభ ఎండన్న, ఐ సి ఆర్ పి జె. జగన్నాథం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 20.** మండలంలోని పనసపుట్టు పంచాయతీ, కడుతుల గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించినట్టు జోలపుట్టు సచివాలయం హార్టికల్చర్ అసిస్టెంట్ శోభ ఎండన్న, ఐ సి ఆర్ పి జె జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద సాగు భూములు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, అటవీ భూమి సాగుతారు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 14వేలు కేంద్ర ప్రభుత్వం 6వేల రూపాయలతో సంవత్సరానికి 20వేల రూపాయలు అందిస్తుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రం లో 8168 గ్రామ పంచాయితీలలో 2026 మార్చి నాటికి 18 లక్షల రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలను చేరువచేసే దిశగా ముమ్మర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయం విస్తరణకు ఐదువేల క్లస్టర్లను ఎంపిక చేసి వివిధ ప్రధాన పంటల సాగు సరళులలో ఏడాది పొడవునా పచ్చదనం సంతరించుకునేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శిలు లోక్కిరం, రామదాసు, గ్రామస్తులు కోములు, విగ్నేష్, కృష్ణ, విగ్నేష్, రాము, దశరథ్, భాస్కర్, సింహాచలం, సోన్ను తదితరులు పాల్గొన్నారు.

# జైప్రకాశ్ నగర్ గ్రామ ముఖద్వారం ప్రారంభం





**కంచరపాలెం,మార్చ్,20(పెన్ పవర్):** కంచరపాలెం హైవే పరిధిలోని జైప్రకాశ్ నగర్ గ్రామ ముఖద్వారం శుక్రవారం ఘనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పి. విష్ణు కుమార్ రాజు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, కంచరపాలెం సీఐ రవి కుమార్, గ్రామ గౌరవ అధ్యక్షులు కొల్లి చిన్నారావు, అధ్యక్షులు నార్లంక సత్యనారాయణ, కార్యదర్శి ఎం వి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డా. ఈతలపాక సుజాత ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామ అభివృద్ధి కోసం ఇటువంటి మౌలిక సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించిన మహిళ ఎస్సై నాగమణి.



**గోకవరం పెన్ పవర్ మార్చి 20:-** గోకవరంలో అత్యధిక జనాభా ఉండడంతో రోడ్లపై విపరీతమైన ట్రాఫిక్ పెరిగిపోయింది దీనితో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ రాకపోకలకు అంతరాయంగా ఉంటున్న పలు దుకాణాలను వాహనాలను అడ్డు తొలగించే పనిలో గోకవరం మహిళా ఎస్సై నాగమణి ప్రత్యేక దృష్టి సారించారు. అధిక రద్దీతోపాటు గ్రామ దేవత అయిన గుబ్బలమ్మ తల్లి జాతర నిమిత్తం మండలంలో పలు ప్రాంతాల నుంచి అత్యధికంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు వస్తూ ఉంటారు వీటి అన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఎస్ఐ నాగమణి తన సిబ్బందితో సహా రోడ్డుపై తిరుగుతూ దుకాణదారులను ట్రాఫిక్ సహకరించాలని కోరుతూ పలు వాహనాలు తనిఖీ చేస్తూ సరైన రికార్డు లేని వాహనాలు ఏమైనా ఉంటే కేసులు రాస్తున్నారు.

# భారీ అభివృద్ధి సాధించాం :ఎమ్మెల్యే బొలిశెట్టి.



**తాడేపల్లిగూడెం.పెన్ పవర్. మార్చి 20:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ఈ రెండేళ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.100 కోట్ల కు పైగా భారీగా అభివృద్ధిని సాధించామని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో, శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.తాము అధికారం చేపట్టే నాటికి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని, తాము వాటిని పునర్నిర్మించామని అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం మాధవరం, అప్పారావు పేట తదితర రోడ్లు,పెంటపాడు మండలం,పడమర విప్పర్రు తాడేపల్లిగూడెం పట్టణాలలో ప్రధాన రహదారులు నిర్మించామని తెలిపారు.నియోజకవర్గం లో అన్ని రహదారులు రాబోయే రెండేళ్లలో పూర్తిచేస్తామని అన్నారు.గత వైసిపి నిర్వాకం వల్ల ఊళ్లోకి బస్సులు రాలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం రహదారులను మంచి నాణ్యతతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. బస్సులు పట్టణం లోకి వచ్చే విధంగా కృషి చేశామన్నారు.వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా, గతంలో ఎన్నాడూ లేని విధంగా గత రెండేళ్లలో 5.4కోట్ల రూపాయలను. అందజేశామని తెలిపారు.మహిళా సాధికారత లక్ష్యసాధన లో భాగంగా స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టి, వారికి ఆర్ టి సి బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కలుగచేశామని అన్నారు.గతంలో జగన్ ప్రభుత్వం దోచుకోవటమే లక్ష్యం గా పనిచేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో సమర్థవంతమైన పరిపాలన జరుగుతుందని, పనిచేసే ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని కోరారు.

# పారిశ్రామిక ప్రాంతం ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందు లో పల్లా





**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 20 :** రంజాన్ మాసం చివరి రోజు సందర్భంగా గాజువాక క్లబ్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం ముస్లిం సహోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.ఆంధ్ర రాష్ట్రంలోని ఉన్న ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.కుల మతాలకు అతీతంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. పవిత్ర రంజాన్ భక్తికి ఉపవాశానికి, దానధర్మాలకు ఆత్మ పరిశీలనకు ప్రతీకమని తెలిపారు. క్షమా గుణానికి ప్రాధాన్యత నిచ్చే మాసం రంజాన్ మాసం అని అన్నారు. సమాజాన్ని మంచి మార్గంలో తీసుకెళ్లేలా ఖురాన్ బోధనలు ఉంటాయని తెలిపారు, దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని మతాల ఔన్నత్యాన్ని గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కోన తాతారావు, నియోజకవర్గ బిజెపి పార్టీ ఇంచార్జ్ కర్ణం రెడ్డి నరసింగరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి , కార్పొరేటర్లు లేళ్ళ కోటేశ్వరరావు, రాజాన రామారావు, తిప్పల వంశీ రెడ్డి,పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, తమ శాస్త్రవేత్తల బృందాలను ఆయా జిల్లాలలో రైతులకు తగిన యాజమాన్య పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియపరిచేందుకు ఏర్పాటు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్ మార్చి 20:**"రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రాయలసీమ జిల్లాల్లో, రాష్ట్రం లోని కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలు దెబ్బతినడం వలన రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు, డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, తమ శాస్త్రవేత్తల బృందాలను ఆయా జిల్లాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం జరిగిన పొలాలను తోటలను సందర్శించి రైతులకు తగిన యాజమాన్య పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియపరిచేందుకు ఏర్పాటు చేయడమైనదని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. కె. ధనుంజయరావు తెలియజేశారు. శుక్రవారం వెంకటరామన్నగూడెం లోని ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఉపకులపతి మరియు విశ్వవిద్యాలయ అధికారులు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అనేక సూచనలు, జాగ్రత్తలు మీడియా ద్వారా తెలియజేశారు .అరటి, మామిడి, బొప్పాయి, కర్బూజా, దానిమ్మ వంటి పండ్లు అలాగే కూరగాయల పంటలు, పూల మొక్కలు ఈ వర్షాల కారణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఈ క్రమంలో సాగుదారులు తీసుకోవలసిన జాగ్రత్తలను ముద్రించి ఆయా జిల్లాల్లో రైతులకు నేరుగా మరియు ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నారు.

అంతేకాక పంటల వారీగా జిల్లాల వారీగా రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారి కోరిన సమాచారం వీలైనంత త్వరగా అందించే దానికి ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను సిద్ధంగా ఉంచినట్లు", ఉపకులపతి డా.ధనుంజయరావు తెలియజేశారు.

ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రాయలసీమ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను చేరుకోవడానికి డా వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తోంది" అని ఉపకులపతి తెలియజేశారు .

హార్టికల్చర్ డిగ్రీ పూర్తి చేసిన యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి, అలాగే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా హార్టికల్చర్ గ్రాడ్యుయేట్స్ అనేకమంది తయారు కానున్నారు, రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్ కింద అనేక ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపన అవకాశాలు వస్తాయని ఉపకులపతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యాన పంటల సాగులో కృత్రిమ మేధస్సు ( ఏ.ఐ.) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని , అలాగే డ్రోన్ ల వినియోగం ద్వారా సాగు ఖర్చు తగ్గించి, రైతు ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్టు ఉపకులపతి డా . కె. ధనంజయరావు తెలియజేశారు.

ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. ఎం. మాధవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డా. బి. ప్రసన్నకుమార్, పరిశోధన సంచాలకులు డా. జి. రామానందం, విస్తరణ సంచాలకులు డా. రూత్ పాల్గొన్నారు.

# నర్సీపట్నం అభివృద్ధిపై మాది విజన్... నీది పాయిజన్



## మాజీ ఎమ్మెల్యేపై మండిపడ్డ చింతకాయల విజయ్

## సృష్టి క్షేత్రం జోలికి రావద్దంటూ హెచ్చరిక

## దేవుడితో రాజకీయాలు వద్దంటూ హితవు

**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 20) :** నర్సీపట్నంలో పుట్టి పెరిగిన వ్యక్తులుగా మాకు నర్సీపట్నం అభివృద్ధిపై విజన్ ఉందని, పక్క ప్రాంతం నుంచి వచ్చిన నీకు నర్సీపట్నంపై పాయిజన్ చిమ్ముతున్నావంటూ మాజీ ఎమ్మెల్యే గణేష్ పై టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మండిపడ్డారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో సృష్టి క్షేత్రం అంశంపై మీడియాతో ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. శుక్రవారం ఉదయం బలిఘట్టంకు చెందిన కొంతమంది రైతులు, పెద్ద చెరువుపై కట్టడాలు కడుతున్నారని, ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నామని, తమ గోడు వినిపించుకోవాలని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ అంశంపై చింతకాయల విజయ్ ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ను ఉద్దేశించి మాట్లాడుతూ నీకు నర్సీపట్నంపై ఏమాత్రం అభిమానం లేదని, అందుకే ఈ ప్రాంతం కి చెందిన ముఖ్యమైన పండగలు వచ్చినప్పుడు వివాదాలు సృష్టిస్తావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో అబీద్ సెంటర్ లో ఉన్న నూకాలమ్మ గుడి పునర్నిర్మాణం చేయాలని తలచి, పది లక్షల తమ కుటుంబ సభ్యులు భాగస్వామ్యంతో దేవాదాయ శాఖకు డిపాజిట్ చేయగా, 40 లక్షలు అదనంగా మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 లక్షలు దండుకుని తెచ్చారని ఆరోపించడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వంలో నూకాలమ్మ గుడి నిర్మాణంలో అడుగడుగునా తప్పులు చేశారని విమర్శించారు. మీరు రాజకీయాలలో వచ్చినప్పటినుండి మాత్రమే నర్సీపట్నంలో దేవాలయాలపై కుట్రలు జరుగుతున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఐదు రోడ్ల జంక్షన్లోని సిద్ధి వినాయక ఆలయాన్ని, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గా మల్లేశ్వర ఆలయాన్ని, పెద్ద చెరువు వద్ద ఉన్న మరిడీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని కుట్రపూరితంగా దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారని విమర్శించారు. మరిడీ మహాలక్ష్మి అమ్మవారి నగలు విషయంలోనూ దుర్మార్గంగా ప్రవర్తించారని దుయ్యబట్టారు. ఇప్పుడు తాజాగా సృష్టి క్షేత్రం పై కుట్రలు చేయడానికి సిద్ధపడ్డారని ఆరోపించారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతులమంటూ మాజీ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన వారెవరూ కూడా నిజమైన రైతులు కాదన్నారు. రాజకీయంగా నా జోలికి, అయ్యన్నపాత్రుడు జోలికి వచ్చినా పరవాలేదు కానీ, దైవంతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవన్నారు. సృష్టి క్షేత్రం ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతమంతా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనంత 108 అడుగుల ఎత్తయిన శివపార్వతుల విగ్రహం పెట్టబోతున్నామని, దీనిని అడ్డుకోవాలని చూస్తే తమ సహించబోమని, ఆ భగవంతుడు కూడా క్షమించడని అన్నారు. ఈ సృష్టి క్షేత్రం ప్రాజెక్టు తనకు ప్రాణ ప్రదమని, దీని జోలికి రావద్దని చివరిసారిగా హెచ్చరిస్తున్నానని, నా మాటలు పెడచెవిన పెడితే రాజకీయంగా సమాధి కాక తప్పదని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో చింతకాయల రాజేష్, జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర, నూకాంబికా ఆలయకమిటీ ఛైర్మన్ కొరుప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాలకు భారీ వర్షం సూచన

- శుక్రవారం సాయంత్రం నుండి ఈదురు గాలులు మెరుపులు ఉరుములతో వర్షాలు






**విశాఖ తూర్పు,పెన్ పవర్,మార్చి 20:** ఏపీలో అన్ని జిల్లాలకు విపత్తుల శాఖవర్ష సూచన చేసింది,భారీ వర్షాలు పడతాయని శుక్రవారం శనివారం విస్తారంగా వర్షాలు పడతాయని పిడుగులతోపాటు భారీ వర్షాలు పడతాయని,చెట్ల కింద ఉండరాదని వాతావరణ శాఖ ప్రజలను హెచ్చరించింది. ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాలు భారీ వర్షాలు పడతాయని మిగతా జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేశారు. అన్నట్టుగానే శుక్రవారం రాత్రి నగరంతో పాటునగర శివారు ప్రాంతాలలో ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com